క్లుప్తంగా

చేతులతో మురుగు తొలగింపు


మురుగు కాలువలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఉన్న మురుగు కాలువ పూడిక, చెత్తచెదారంతో నిండిపోయింది. మురుగు నీరు ముందుకు పారకుండా నిల్వ ఉండడంతో శుక్రవారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కార్మికుడు లక్ష్మన్న మురుగు కాలువలోకి దిగి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎలాంటి గ్లౌజులు, రక్షణ పరికరాలు లేకుండా రెండు చేతులతో మురుగు కాలువలోని చెత్తా చెదారాన్ని బయటకు తీసివేశాడు. కనీసం సలికె వంటి పరికరాన్ని కూడా ఉపయోగించలేదు. దీన్ని చూసిన పట్టణ ప్రజలు.. పారిశుద్ధ్య కార్మికులకు అధికారులు పరికరాలు అందించడతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

ఆస్పరి: ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి మోసం చేసిన ముగ్గురు వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ చెప్పిన వివరాలు.. మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన చిన్న తిక్కయ్యతో పాటు మరో నలుగురికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నెల్లూరుకు చెందిన నిర్మల, సుధాకర్, విశాఖపట్టణంకు చెందిన గీత రూ.24 లక్షలు తీసుకున్నారు. అనంతరం మూడేళ్లు గడిచినా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో బాధితులు ఆస్పరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్న తిక్కయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్మల, సుధాకర్, గీతపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

హొళగుంద: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఆనంద్ లోకదశ్ సూచించారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం గ్రామస్థాయి అగ్రికల్చరల్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతుల కోసం ఆర్బీకేల్లో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఖరీఫ్ 2023కి సంబంధించి సీసీఆర్‌సీ కార్డులు పొందడం, పంటల బీమా, ఈ క్రాప్ బుకింగ్ పక్కాగా నమోదు చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామానికి చెందిన వివాహిత గాయత్రి (20) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాయత్రికి కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నేమకల్లు సంగాల గ్రామానికి చెందిన సమీప బంధువు గాదిలింగతో మూడు నెలల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజుల క్రితం గాయత్రి పుట్టినిల్లు చాబాల గ్రామానికి వచ్చింది. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు పొలానికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెళ్లి ఇష్టం లేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి గాదిలింగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

ఘనంగా పూలరథోత్సవం

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన మంగమాంబ దేవి పూలరథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గత వారం రోజుల నుంచి నిర్వహించిన సప్తభజనలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం మంగమాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీగా తరలివచ్చిన భక్తుల మధ్య ఎదురు బసవన్న గుడి వరకు పూలరథాన్ని లాగారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చిప్పగిరి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరంలో కిమ్స్ సవేరా హాస్పిటల్ సిబ్బంది వైద్యసేవలందిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించే వైఎస్సార్ జయంతి ఉత్సవాలకు కార్యకర్తలు నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రీసర్వేపై అపోహలు వద్దు

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి 'జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకం' భూ యజమానులకు వరం అని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం మండలంలోని బసాపురంలో గ్రామసభ నిర్వహించి రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలు పరిష్కరించడంతో పాటు, రైతులందరికీ కచ్చితమైన కొలతలతో భూహక్కు పత్రాలు అందించడమే లక్ష్యంగా సమగ్ర సర్వే చేపట్టిందన్నారు. భూమిని సమగ్ర సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు రికార్డులను డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలకు రీసర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. సర్వేయర్ రమణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సురక్ష


బిల్లేకల్లులో మహిళకు ఆదాయ సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రైతుకు అడంగల్ అందజేస్తున్న అధికారులు

ఆస్పరి: అర్హత కలిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారంటూ ఉండరాదని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సచివాలయాలలో క్యాంపులు నిర్వహించి సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే 11 రకాల ధ్రువపత్రాలను వెంటనే లబ్ధిదారులకు ఉచితంగా మంజూరు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం తదితర సేవలు అందిస్తున్నారు. మండలంలో ఆస్పరి, బిల్లేకల్లు, ములుగుందం గ్రామాలలో శుక్రవారం 817 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అధికారులు అందజేశారు.

గోనెగండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు సులభంగా ధ్రువీకరణ పత్రాలు అందుతున్నాయని తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బైలుప్పల, పెద్దమరివీడు గ్రామాల్లో సురక్ష కార్యక్రమం నిర్వహించి వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, అబ్దుల్లా సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


చెరుకులపాడులో ధ్రువీకరణ పత్రాలందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వెల్దుర్తి: చెరుకులపాడు సచివాలయం ఆవరణలో శుక్రవారం జగనన్న సురక్ష కారక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, డీటీ ప్రసాద్‌రాజు, ఈఓఆర్డీ నరసింహులు, జెడ్పీటీసీ సుంకన్న ఆధ్వర్యంలో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 313 మందికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు.

జగనన్నకు కృతజ్ఞతలు



నాకు ఇద్దరు కుమారులు ఒకరు డిగ్రీ, మరొకరు ఇంటర్మీడియెట్ చదవుతున్నారు. వారికి కులం, ఆదాయం సర్టిఫికెట్లు అవసరమయ్యాయి. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. గతంలో మండల కేంద్రమైన ఆస్పరికి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు నానా కష్టాలు పడ్డాం. ఇలాంటి సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఆవుల నాగేంద్ర ములుగుందం, ఆస్పరి

చాలా మంచి కార్యక్రమం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి కార్యక్రమం చేపట్టారు. పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. నా కుమారుడు పుటుకలమర్రి మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. దరఖాస్తు చేసుకున్న వెంటనే సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసినందుకు సంతోషంగా ఉంది.

– కురువ శేఖర్, ఆస్పరి

గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు



ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పత్తికొండ రూరల్: మూడురోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందిన స్థానిక ఫక్కుమియ్యా దర్గా ముజావర్ బుజ్జు కుటుంబాన్ని శుక్రవారం సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీధర్‌రెడ్డి పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముస్లీం మైనారిటీ నాయకుడు కొలిమి షేక్షావలిని పరామర్శించారు.

వెయిట్‌లిఫ్టర్లకు సహకారం అందిస్తాం


ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సన్మానిస్తున్న వెయిట్‌లిఫ్టర్లు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని వెయిట్‌లిఫ్టర్లకు తమ వంతుగా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పట్టణంలోని 1990 బ్యాచ్ క్రీడాకారులు 30 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. నాడు వివిధ ప్రాంతాల్లో వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా సహాయ సహకారాలందించిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ వెయిట్‌లిఫ్టర్లు స్థానికంగా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇవ్వాలని ఇందుకు తన సహకారం ఉంటుందన్నారు. కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని వాకె కోరగా పట్టణంలో 4 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామని, అలాగే మున్సిపల్ శాఖ ద్వారా వెయిట్‌లిఫ్టింగ్ పరికరాలు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. సీనియర్ వెయిట్‌లిఫ్టర్లు వైస్ ఎంపీపీ పోలయ్య, వెంకటేష్, నీలకంఠ, రహీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు సహకరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పట్టణంలో ప్రధాన రోడ్డు విస్తరణకు వ్యాపారులు, దుకాణదారులు, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పట్టణవాసులతో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతోందన్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపడితే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. అందరూ సహకారం అందిస్తే, త్వరితగతిన పనులు పూర్తిచేస్తామన్నారు. ఇందులో రాజకీయం చేయవద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఆర్‌డీఓ మోహన్‌దాసు మాట్లాడుతూ.. ఊరివాకిలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు 55 అడుగులు, గుత్తి టర్నింగ్ నుంచి చక్రాళ్ల రోడ్డు టర్నింగ్ వరకు 46 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. రోడ్ల విస్తరణకు మొత్తం 281 మందిలో 241 మంది అనుకూలంగా ఉన్నారని, 40 మంది మాత్రం కోర్టుకు వెళ్లారన్నారు. 281 మందికి సంబంధించిన షాపులు, ఇళ్లు కొద్దిమేర కోల్పోతారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అడుగుకు రూ.660 చొప్పున పరిహారం అందిస్తామన్నారు. దీనిపై వారి అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. ప్రజల అభ్యర్థనలను పరిశీలించి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జిల్లా కలెక్టరుతో మాట్లాడి, వీలైనంత మేరకు నష్టపరిహారం పెంచేందుకు కృషిచేస్తారన్నారు. వారం రోజుల్లోగా అభిప్రాయాలు తెలపాలన్నారు. తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఆర్‌అండ్‌బీ డీఈ నాగశంకరరెడ్డి, ఏఈ శ్వేత, ఎస్‌ఐ గోపాల్, రెవెన్యూ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలకు సంబంధించి నగదును దళారులు ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల పిల్లలను బాగా చదివించడమే గాకుండా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నామని ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రామంలోని వృద్ధురాళ్లతో కాసేపు ముచ్చటించారు. పింఛన్ వస్తుందా అని అడగ్గా ఇంటికే తెచ్చి ఇచ్చిపోతున్నారమ్మా అని వారు బదులిచ్చారు. అక్కడే ఉన్న 104 వాహనం దగ్గరకు వెళ్లి అందుతున్న వైద్యసేవలపై గర్భిణులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, సర్పంచు విజయుడు, వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ అపహరణ

ఎమ్మిగనూరు: పట్టణంలోని గీతామందిర్ కాలనీలోని గాయత్రి దేవాలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి లోనికి చొరబడ్డారు. ఆలయ హుండీని ఎత్తుకెళ్లినట్లు పూజారి నరసింహాచారి తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

లూజు విత్తనాలు కొనొద్దు

మద్దికెర: పత్తి పంట సాగు చేసే రైతులు లూజు విత్తనాలను కొనవద్దని ఏఓ రవి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గుర్తింపు కలిగిన అధీకృత డీలర్ల వద్ద విత్తనాలు కొనాలని సూచించారు. రశీదులు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

గర్భిణులకు అన్నదానం

మద్దికెర: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ అన్నదానం చేశారు. వైద్యులు మాట్లాడుతూ వైద్య పరీక్షల కోసం వచ్చిన వారు ఇబ్బంది పడకుండా ఆహారం అందించడం హర్షించదగ్గ విషయమన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

కృష్ణగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని ఎస్‌ఆర్‌పీ మల్లికార్జున అన్నారు. మండల పరిధిలోని అమకతాడు, ఆలంకొండ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన శుక్రవారం సామాజిక తనిఖీ ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఏడాదిగా చేసిన పనులకు సంబంధించి వేతనాలు వచ్చిన వెంటనే వాటిని జాబ్‌కార్డుల్లో నమోదు చేయాలన్నారు. చేపట్టిన పనుల కొలతల్లో తేడాలు లేకుండా చూసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయలన్నారు.

నేడు గూళ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంతోని, జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని చెప్పారు. ఆయాశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన పథకాలు, ప్రజా సమస్యలపై మంత్రి ప్రజలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ


ఎం.కొట్టాలలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ..ప్రజా సమస్యలు తెలుసుకుంటూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పర్యటన చేశారు. శుక్రవారం ఆలూరు మండలంలోని ఎం.కొట్టాల, కె.కొట్టాల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ సీఎం జగన్ వారికి అండగా ఉంటున్నారన్నారు. ఎం.కొట్టాల, కె.కొట్టాల గ్రామ ప్రజలకు రూ.12.10 కోట్ల లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ అందించారు. గ్రామంలో నెలకొన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టి తీసుకొచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.20 లక్షల్లో రూ.10 లక్షలతో లక్ష లీటర్ల సామర్థ్యం ఉన్న తాగునీటి సంపు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అలాగే రెండు గ్రామాల్లో రూ.5 లక్షలు చొప్పున సీసీ రోడ్లు, డ్రైనేజి ఏర్పాటుకు నిధులు కేటాయించాలన్నారు. నాయకులు నారాయణ స్వామి, శేఖర్, ఈరన్న, వీరేష్, రాంభీం నాయుడు, లలితమ్మ గోవిందరాజులు, ప్రసాద్, అంజినయ్య, రాజు, ప్రభుదాస్, లక్ష్మిరెడ్డి, మారెప్ప, రామాంజి, తిక్కన్న, కిష్టప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల ప్రారంభం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిందని మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. హాలహర్వి మండలం కొక్కెరచేడు గ్రామంలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని, ఎల్లార్తి రోడ్డులోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం మంత్రి జిల్లా బీసీ సంక్షేమ సహాయ సంచాలకులు వెంకటలక్ష్మి సమక్షంలో ప్రారంభించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జానపద కళాకారులకు ప్రోత్సాహం

హాలహర్వి: జానపద కళాకారులను ప్రోత్సహిద్దామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు హాలహర్విలో కళాకారులు ప్రదర్శించిన జానపద నాటికాన్ని మంత్రి తిలకించారు. అనంతరం నాటక కళాకారులకు రూ.80 వేలు నగదు బహుమతి అందజేశారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి


ఎమ్మిగనూరు 23వ వార్డులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు పరిచారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని 23వ వార్డు రాధాకృష్ణ కాలనీలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ చంద్రమోహన్ రెడ్డి తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందించి వారితో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. మరోసారి సీఎంగా వైఎస్ జగనన్నకు అవకాశం ఇస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టీడీపీని నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీ'జులుం' నియంత్రించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అధికారులు సక్రమంగా అమలు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, నరసన్న, వీరేష్‌యాదవ్, ఆఫ్రిద్ తదితరులు బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారంటూ విద్యాశాఖ అధికారులతో వారు వాగ్వాదానికి దిగారు. స్పందించిన ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజులు పాఠశాలలు తనిఖీ చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

- పట్టణంలోని మిలటరీ కాలనీలో ఐ స్కూల్ పేరిట ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పాఠశాల ముందు ధర్నా చేసిన విద్యార్థి సంఘ నాయకులు అనంతరం ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజులకు వినతిపత్రాన్ని అందించారు.

ముళ్లకంపల తొలగింపు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ గ్రామ సర్పంచ్ ముజుబుర్ రహిమాన్ శుక్రవారం తన సొంత డబ్బు రూ.25 వేలు వెచ్చించి దారిపొడవునా అడ్డంగా పెరిగిన ముళ్లకంపలను తొలగించారు. రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లకంపలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ మలుపు వద్ద వెళ్లే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పలు ప్రమాదాలు జరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలు నివారించేలా శుక్రవారం జేసీబీతో రెండు కిలోమీటర్ల మేర ముళ్లకంపల తొలగింపు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి


ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌చైతన్య

ఎమ్మిగనూరుటౌన్: ఎస్సీ వర్గీకరణ చేసి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌చైతన్య కోరారు. ఎంఆర్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీ తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు రాముడు, ప్రభాకర్, సురేంద్ర,వాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: ఆస్పరిలో శుక్రవారం ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సమితి జెండాను జిల్లా కో-కన్వీనర్ సంజప్ప అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మాదిగలు ఐకమత్యంతో ఉండాలన్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మనోజ్, రామాంజినేయులు, చిన్న సంజన్న, పెద్దయ్య, మహానంది, సుంకన్న, హనుమంతు, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు


కోడుమూరులో లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న కామేశ్వర ప్రసాద్

కోడుమూరు రూరల్/ గోనెగండ్ల: కుష్టు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని లెప్రసీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కోడుమూరులో జరుగుతున్న లెప్రసీ సర్వేను ఆయన పరిశీలించారు. లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ భాస్కర్‌తో కలిసి గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. జూన్ 26 నుంచి జూలై 16 వరకు అంటు వ్యాధుల(సీడీఎన్‌సీడీ)పై జిల్లాలో సర్వేలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,77,202 మందిని పరీక్షించగా..628 మందికి అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించారన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

హొళగుంద: అతివృష్టి, అనావృష్టి, వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటలు కోల్పోయి కష్టకాలంలో ఉన్న రైతన్నకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆపద్బాంధవుడిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, సిగింల్‌విండో చైర్మన్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం వారు హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతు భరోసా, పంటల బీమా, పంట నష్టపరిహారం, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, పరికరాలు ఇలా అనేక విధాలుగా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకుంటుండడం హర్షించదగ్గ విషయమన్నారు. హొళగుందలో శనివారం జరిగే వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.